# Key Area 7 : Leading school administration

## ప్రధాన రంగం : పాఠశాల నిర్వహణ నేతృత్వం

**మాడ్యూల్ పేరు** : సమానత కోసం విద్య – జెండర్ సమానత (Gender Equality – Education)

**యూనిట్–1** : జెండర్ అంటే ఏమిటి?

**యూనిట్–2** : పాఠశాల కార్యక్రమాలలో జెండర్ సమానత

**యూనిట్–3** : జెండర్ పరంగా మూస ధోరణులు – వివక్షత

**రచయిత** : శ్రీ E.D. మధుసూదన్ రెడ్డి,
ఉపాధ్యాయుడు (SRG),
ZPHS బహార్ పేట్, కోస్గి,
నారాయణపేట్ జిల్లా.

# సమానత కోసం విద్య

# జెండర్ సమానత

## ఉపోద్ఘాతం

మన సమాజంలో, పాఠశాలలో, కుటుంబంలో, వ్యక్తిగతంగా 'జెండర్'ను గుర్తించడం, 'జెండర్' గురించి అవగాహన చేసుకోవడం అనేది అనేక అపోహలతో కూడి ఉంది. లింగం (Sex), జెండర్ (Gender) అనే పదాలు ఒకే అర్థంతో విద్యావంతులు కూడా వాడటం జరుగుతున్నది. అదేవిధంగా జెండర్‌కు సంబంధించిన మూసధోరణులను పాటించడం, వాటిని ప్రశ్నించకపోవడంతోపాటు సమర్థించడం, ప్రతికూల అవగాహనతో వ్యవహరించడం జరుగుతున్నది. ఇది కుటుంబం, పాఠశాల, సమాజం ఇలా అన్ని చోట్లా జరుగుతోంది. ముఖ్యంగా సామాజిక సంస్థలలో, సమాజంలో, వార్తాప్రసారమాధ్యమాలలో, వివిధ వృత్తుల నిర్వహణ ప్రాంతాలలో జెండర్ సమానత పాటించబడాలి. ఇందుకు పునాది 'గృహం' ప్రాతిపదికగా ప్రారంభం కావలసి ఉంటుంది. కాని మన సమాజం నిరక్షరాస్యత, తరాల తరబడి పెనవేసుకున్న భావజాలం, సామాజిక నియమ నిబంధనలు, కట్టుబాట్లు తదితర అంశాలతో ముడిపడి ఉండడంవల్ల 'ఇల్లు' ఆ లక్ష్యాన్ని సాధించడంలో బహుముఖ పాత్ర పోషించలేకపోతున్నది. కాని సర్వతోముఖాభివృద్ధి సాధన, వ్యక్తిత్వ నిర్మాణం, పిల్లల ప్రవర్తనలో సానుకూల మార్పు, సామాజిక ప్రగతి లాంటి అంశాల సాధన మరియు ప్రధానంగా 'సమానత కోసం విద్య' లక్ష్యంగా ఏర్పడిన పాఠశాలలు 'జెండర్ సమానత' ను సాధించడంలో ప్రముఖపాత్ర పోషించవలసి ఉంటుంది.

కొన్ని అధ్యయనాల ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో కుటుంబం, కుటుంబ వాతావరణం ఈ అంశాలపై బలమైన ప్రభావం చూపుతున్నాయని, అభివృద్ధిచెందుతున్న దేశాలలో పాఠశాల ముఖ్యపాత్ర పోషిస్తున్నదని తేలింది. కాబట్టి జెండర్ సమానత అంశానికి సంబంధించి మన దేశంకు సంబంధించినంత వరకు కుటుంబం, సమాజం కంటే పాఠశాలపై ఎక్కువ గురుతర బాధ్యత ఉంది.

పాఠశాల నాయకులు పాఠశాల నిర్వహణలో నిర్వహించే కార్యక్రమాలలో, విద్యాసంబంధ, సాంస్కృతిక మొదలగు అంశాలన్నింటిలో జెండర్ గురించి అవగాహనను విద్యార్థులలో పెంపొందించి జెండర్ సమానతకు పునాది వేయాలి.

జెండర్ సమానత సాధనలో పాఠశాల, పాఠశాల భాగస్వాములయిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల నాయకులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య సంఘం, పాఠశాలతో సంబంధంగల సంస్థలు భాగస్వాములు కావాలి. ఈ భాగస్వాములు ప్రణాళిక రూపకల్పన, అమలు, నిర్వహణ వంటి వాటి ద్వారా జెండర్ సమానతను సాధించేలా చూడాలి. ఆ మార్గంలో పయనించే వారికి మరింత తోడ్పాటునందించడానికి ఈ మాడ్యూల్ మీకు తోడ్పాటునందిస్తుంది.

# 1. జెండర్ అంటే ఏమిటి?

## అభ్యసన ఫలితాలు

1) జెండర్‌కు సంబంధించి ప్రస్తుతం గల జెండర్ ఆధారిత వైఖరులు, ప్రవర్తనలను టీచర్లు, విద్యార్థులు గుర్తిస్తారు.

2) జెండర్ సాంఘికంగా ఆపాదించబడిందని వివరిస్తారు.

3) జెండర్‌కు, లింగానికి మధ్యగల తేడాను గుర్తిస్తారు.

## కీలక పదాలు

జెండర్ (Gender), లింగం (Sex), దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్, వైవిధ్యం, వివక్షత, సామాజిక సంస్థ.

## ఉపోద్ఘాతం

పాఠశాల ఒక సామాజిక సంస్థగా, ఉత్తమమైన భావిపౌరులను తీర్చిదిద్దే కేంద్రంగా, వ్యక్తిత్వాలను తీర్చిదిద్దే స్థలంగా నిర్వహించబడుతుంది. ఈ సంస్థకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతరులు అందరూ పాఠశాల విద్యాలక్ష్యాల సాధనలో భాగస్వాములుగా ఉంటారు. వీరందరికీ జెండర్, జెండర్ సమానత, జెండర్‌పరంగా వివక్షతల గురించి తప్పకుండా సరయిన అవగాహన ఉండవలసిన అవసరం ఉంది. వీరందరి ద్వారా సమాజానికి కూడా ఈ అంశాలు చేరవలసి ఉంది. పాఠశాల నాయకులు, సౌకర్యకర్తలు (ఉపాధ్యాయులు), పాఠశాల నిర్వహణలో, వివిధ కార్యక్రమాల అమలులో, తరగతి గది నిర్వహణలో, బోధనాభ్యసన ప్రక్రియలలో జెండర్ సమానతకు సంబంధించి సానుకూల దృక్పథాన్ని విద్యార్థులలో పెంపొందించాలి.

వ్యక్తులు మరియు సాంఘిక ప్రక్రియలతో సమాజ నిర్మాణం నిరంతరంగా జరుగుతుంటుంది మరియు మారుతూ ఉంటుంది. ఈ సామాజిక నిర్మాణంలో భౌగోళిక అంశాలు, చారిత్రక అంశాలు, సాంఘిక – ఆర్థికాంశాలతోపాటు విద్య కూడా ప్రముఖపాత్ర పోషిస్తుంది.

జెండర్ అనేది కూడా ఈ సామాజిక ప్రక్రియ నుండి ఉద్భవించిన అంశమే. సాధారణంగా మనకు లింగం (Sex) అనే పదం గురించి తెలుసు. ఇది శారీరక నిర్మాణ సంబంధమైనది. దీని ప్రకారం స్త్రీలు, పురుషులను మనం లింగపరంగా గుర్తిస్తాం. వీరితోపాటు ట్రాన్స్‌జెండర్లను కూడా లింగపరంగా గుర్తించవలసి ఉంటుంది. లింగంతోపాటు సామాజికపరంగా, సాంస్కృతికపరంగా స్త్రీలు, పురుషులు, ట్రాన్స్ జెండర్లకు ఆపాదించబడినదే 'జెండర్'. జెండర్ అనేది గతిశీలమైనది. ఇది కాలానుగుణంగా, సాంస్కృతికపరంగా, భిన్న భౌగోళిక ప్రాంతాలలో మారుతూ ఉంటుంది. జెండర్‌పై వర్గ, కుల, మతం, జాతి, సంప్రదాయాల వంటి అనేక కారకాల ప్రభావం ఉంటుంది. మనం స్త్రీలు, పురుషులు, ట్రాన్స్ జెండర్లను ఎలా గుర్తిస్తామో, నిర్ణయిస్తామో వాటి ఆధారంగానే జెండర్ గుర్తించబడుతుంది. 'జెండర్'ను గుర్తించబడడం ఆధారంగానే ఈ అంశంపై మన అవగాహన ఆధారపడి

ఉంటుంది. జెండర్ సమానత సాధించబడాంటే లింగపర సమానత కూడా అవసరమే. మన సమాజం స్త్రీలు, పురుషులకు, సమానస్థాయి ఇచ్చినప్పుడే జెండర్ సంబంధ వివక్షత తొలగిపోతుంది.

ఈ క్రింద ఇవ్వబడిన కృత్యం ఆధారంగా మీరు 'జెండర్' గురించి, అదేవిధంగా జెండర్–లింగానికి మధ్యగల భేదాల గురించి స్పష్టంగా తెలుసుకోవచ్చును.

ఈ క్రింది లక్షణాలను పరిశీలించండి.

- సున్నితత్వం
- దృఢత్వం
- సిగ్గుపడడం
- సంతానంపై ప్రేమ చూపడం
- సంపాదించడం
- శారీరక కష్టం చేయడం
- భయపడడం
- ఏడ్వడం
- కండలతో ఉన్న శరీరం
- గంభీరత్వం

ఒక పట్టిక రూపొందించి పై వాటిలో ఏవి స్త్రీలకు, ఏవి పురుషులకు సంబంధించినవని భావిస్తున్నారో రాయండి.

బహుశ మీరు ఈ విధంగా రాసి ఉండవచ్చు :

| **స్త్రీలు** | **పురుషులు** |
|---|---|
| సున్నితత్వం | దృఢత్వం |
| సిగ్గుపడడం | సంపాదించడం |
| భయపడడం | శారీరక కష్టం చేయడం |
| ఏడ్వడం | కండలతో ఉన్న శరీరం |
| సంతానంపై ప్రేమ చూపడం | గంభీరత్వం |

ఈ అభిప్రాయానికి మీరు రావడానికిగల కారణాలను ఆలోచించండి.

ఇప్పుడు స్త్రీల శీర్షికను పురుషులుగా, పురుషుల శీర్షికను స్త్రీలుగా మార్చండి.

| **పురుషులు** | **స్త్రీలు** |
|---|---|
| సున్నితత్వం | దృఢత్వం |
| సిగ్గుపడడం | సంపాదించడం |
| భయపడడం | శారీరక కష్టం చేయడం |
| ఏడ్వడం | కండలతో ఉన్న శరీరం |
| సంతానంపై ప్రేమ చూపడం | గంభీరత్వం |

బహుశ మీ అనుభవంలో మీరు స్త్రీలకు ఆపాదించిన లక్షణాలను పురుషులకు, పురుషులకు ఆపాదించిన అంశాలను స్త్రీలు వ్యవహరించి ఉండవచ్చు. అలా వ్యవహరించడానికి అందుకు కారకాలను ఆలోచించండి, విశ్లేషించండి. మీ దైనందిన జీవితంలో, మీ పరిచయస్థులలో, వివిధ వార్తా మాధ్యమాలలో స్త్రీలు, పురుషుల ప్రవర్తనలను మీరు వివిధ సందర్భాలలో గమనించి ఉండవచ్చును. దీనిని బట్టి పై అంశాలు స్త్రీలు, పురుషులకు సమాజం ఆపాదించిన లక్షణాలేకాని అవి వాస్తవంగా స్త్రీలు, పురుషులు ఇరువురికీ చెందినవని అర్థమవుతుంది.

కింది అంశాలను గమనించండి :

- పిల్లల్ని కనడం
- మీసాలు, గడ్డాలు
- పిల్లలకు పాలివ్వడం
- ఋతుచక్రం
- ఛాతిపై వెంట్రుకలు
- గంభీరమైన స్వరం

ఈ అంశాలో స్త్రీలు, పురుషులకు సంబంధించిన వాటిని గమనించండి.

| **స్త్రీలు** | **పురుషులు** |
|---|---|
| పిల్లల్ని కనడం | మీసాలు, గడ్డాలు |
| పిల్లలకు పాలివ్వడం | ఛాతిపై వెంట్రుకలు |
| ఋతుచక్రం | గంభీరమైన స్వరం |

ఇప్పుడు స్త్రీలు, పురుషుల శీర్షికలను పరస్పరం మార్చండి.

| **పురుషులు** | **స్త్రీలు** |
|---|---|
| పిల్లల్ని కనడం | మీసాలు, గడ్డాలు |
| పిల్లలకు పాలివ్వడం | ఛాతిపై వెంట్రుకలు |
| ఋతుచక్రం | గంభీరమైన స్వరం |

ఈ అంశాలు అసంబద్ధమని, సాధ్యంకాదని మనకు తెలుస్తుంది. ఇవి స్త్రీలు, పురుషులకు నిర్దిష్టంగా ఉన్న లక్షణాలని అర్థమవుతుంది.

పిల్లల్ని కనడం, పిల్లలకు పాలివ్వడం, ఋతుచక్రం వంటి అంశాలు స్త్రీలకు; మీసాలు, గడ్డాలు, ఛాతిపై వెంట్రుకలు, గంభీర స్వరం వంటివి పురుషులకు ప్రత్యేకమని, ఇవన్నీ శారీరక సంబంధమైనవని గుర్తించవచ్చు. వీటినే లింగ(Sex) పర అంశాలుగా భావిస్తాం. వీటి ఆధారంగా స్త్రీలు, పురుషులను లింగపరంగా గుర్తిస్తాం. కాని సున్నితత్వం, ఏడ్వడం, సిగ్గుపడడం, కండలు తిరిగిన శరీరం, భయపడడం, సంపాదించడం వంటి అంశాలు స్త్రీ, పురుషులు ఇరువురికీ చెందిన అంశాలుగా గుర్తించవచ్చును. వీటిని సమాజం ఆపాదించిన జెండర్‌పర అంశాలుగా అవగాహన చేసుకోవాలి.

**లింగం** : శారీరక సంబంధమైనది, పుట్టుకతో నిర్ధారించబడేది, మార్చలేనిది (శస్త్ర చికిత్స లేకుండా), కాలం, వయస్సు, సమాజం ద్వారా మారనిది.

**జెండర్** : సామాజికంగా ఆపాదించబడింది. ప్రవర్తన, ఆలోచించే విధానం ద్వారా తెలియజేయబడేది. వివిధ సమాజాలు, దేశాలు, కాలాలు, సంస్కృతులలో జెండర్ సంబంధ ధోరణులు వేర్వేరుగా ఉంటాయి. ఇవి మారుతూ ఉంటాయి.

## జెండర్ సమానత – పాఠశాలల పాత్ర :

విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకే సమాజం నుండి వచ్చినవారు. వారికి కూడా లింగం, జెండర్‌కు సంబంధించిన నమ్మకాలు ఉండవచ్చును. ఈ నమ్మకాల ఆధారంగా తెలిసీ, తెలియక తరగతి గది ప్రక్రియలలో, పాఠశాల నిర్వహణ మరియు కార్యక్రమాలలో పక్షపాతంతో వ్యవహరించరాదు. వివక్షత చూపరాదు. కొందరు

హక్కులపట్ల అవగాహన ఉంటుంది మరియు అనుభవిస్తారు. చాలా మందికి హక్కులపట్ల అవగాహన ఉండదు. వాటిని అనుభవించలేరు. అంటే వారికి హక్కులు నిరాకరించబడతాయి. ఇదే వివక్షత. బాలికలు ముఖ్యంగా పేదవర్గాలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, దివ్యాంగులతో వ్యవహరించినప్పుడు వివక్షత చూపరాదు. అభ్యసన వాతావరణంలో తరగతి ప్రక్రియలలో అయాచితంగా వాడే కొన్ని వాక్యాలు, పదాలు వివక్షతను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు బాలికలకు ఏడుపును, సిగ్గును ఆపాదించి మాట్లాడడం. బాలురకు ధైర్యాన్ని, భయపడకపోవడాన్ని ఆపాదించి మాట్లాడడం. ఒక్కోసారి బాలికలను మగవారిలా ప్రవర్తిస్తున్నారని, బాలురను ఆడపిల్లల్లాగా ఏడుస్తున్నారని అనడం కూడా వివక్షతను చూపుతుంది.

మనుషుల రూపురేఖలు, అవయవాల నిర్మాణం వైవిధ్యంలో ఉండడం సహజం. వైవిధ్యం గొప్పది. ప్రశంసనీయమైనది. ఇది ప్రాకృతిక అంశం. ఈ భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని అభినందించాలి, సంతోషంగా స్వీకరించాలి. వైవిధ్యాలు ప్రశంసనీయమైనవి. అయితే, వివక్షత గర్హనీయమైనది. వివక్షత కృత్రిమమైనది. ఇది వ్యక్తుల హక్కుల ఉల్లంఘునకు చెందినది. ఇది వ్యక్తుల గౌరవాన్ని తగ్గించేది. కాబట్టి కుల, మత, రంగు, జాతి, ప్రాంతం, భాష, సంస్కృతి, పేదరికం, లింగ, వయస్సుపరమైన భేదాలు చూపరాదు. అదే విధంగా జెండర్‌పరమైన వివక్షత సరికాదు. సమాజం ఆపాదించిన జెండర్ వివక్షతను పాఠశాల తరగతి గది ప్రక్రియలు రూపుమాపేలా ఉండాలి. అంతేకాని వాటిని బలోపేతం చేసేలా ఉండరాదు. కుటుంబం, సమాజం నుండి ఏర్పరుచుకున్న నకారాత్మక, ప్రతికూల ఆలోచనలను పాఠశాల తరగతి గది ప్రక్రియలు రూపుమాపి వివక్షతలేని సానుకూల దృక్పథాన్ని, సకారాత్మక వైఖరులను ఏర్పరచగగాలి.

సాధారణంగా తరగతి / పాఠశాల ప్రక్రియలలో బాలురకు చాక్‌పీస్‌లు తేవడం, బెల్‌కొట్టడం, సామగ్రి తీసుకురావడం వంటి పనులు అప్పగించడం చేస్తుంటారు. బాలికలకు తరగతి గదులు శుభ్రపరచడం, అంకరణ, నృత్యం వంటివి కేటాయిస్తుంటారు. ఇవన్నీ కూడా జెండర్ పరంగా వివక్షతను చాటేవే. ఈ పనులన్నీ బాలురు, బాలికలు ఇరువురికి అప్పగించగలిగేవే. కాబట్టి బాలికలకు కేటాయించే పనులు, బాలురకు కేటాయించే పనులు అని ఉండరాదు. సాధారణంగా కుటుంబం, సమాజం బాలికలకు వివక్షతతో కూడిన పనులను అప్పగించినట్లే పాఠశాల కూడా ప్రవర్తించరాదు. వివక్షత పోవాలంటే బాలురకు శుభ్రపరచడం వంటి పనులు, బాలికలకు బెల్ కొట్టడం వంటి పనులు అప్పగించాలి. దీంతో వారిలో చిన్నప్పటి నుండే వివక్షత పోయి జెండర్ సమానతకు పునాది పడుతుంది. ఏ పని అయినా సామాజికంగా ఆపాదించబడిందే. బాల, బాలికలు ఇరువురూ ఏ పనయినా సమర్థవంతంగా నిర్వహించగరు. ఈ అంశాన్ని బాలురు, బాలికలు ఇరువురూ గుర్తించేటట్లు, అవగాహన చేసుకునేట్లు, ఈ అవగాహన దైనందిన జీవితంలో ప్రతిఫలింపచేసేలా తరగతి / పాఠశాల ప్రక్రియలు ఉండాలి.

విద్యార్థుల సమర్థత లేదా వారి అభిరుచుల ఆధారంగా పనులు అప్పగించాలి తప్ప జెండర్ దృష్ట్యా పనులు అప్పగించడం సరియైన చర్యకాదు.

దైనందిన జీవితంలోని కొన్ని సన్నివేశాలు జెండర్ సమానతను ప్రతిఫలించే విధంగా ఉన్నాయా, లేదా అని పరిశీలిద్దాం.

కింద సూచించిన పనులు స్త్రీ, పురుషులలో ఎవరు నిర్వహిస్తారో మీ పరిశీలనల ఆధారంగా తెలపండి.

- హోటల్స్‌లో వంట చేసేవారు, శుభ్రపరిచేవారు స్త్రీ, పురుషతలో ఎవరు ఎక్కువగా ఉంటారు?
- మీ ఇంట్లో వంటచేయడం, ఇల్లు శుభ్రపరచడం పనులు ఎవరు (స్త్రీలు, పురుషులు) చేస్తారు?

సాధారణంగా హోటల్స్‌లో వంట చేసేవారు, శుభ్రపరిచేవారు ఎక్కువగా పురుషులు ఉంటారు. అదే విధంగా ఇండ్లలో వంటచేయడం, శుభ్రపరచడం స్త్రీలు ఎక్కువగా చేస్తూ ఉంటారు. దీనినిబట్టి మనకు అర్థమయ్యే అంశం ఏమిటంటే వంట చేయడం, శుభ్రపరచడం వంటి పనులు సమాజం స్త్రీలకు ఆపాదించినప్పటికీ, సమాజ నిర్మాణంలో పురుషులు కూడా ఈ పనులు చేపట్టడం మనం గమనిస్తాం. కాబట్టి పనులనేవి జెండర్ వివక్షతతో ఉండరాదు. ఈ వివక్షత పోవాలి. అదే విధంగా పాఠశాల ప్రక్రియలలో బాలురు, బాలికలకు పనులు అప్పగించేటప్పుడు కూడా వివక్షత చూపరాదు. జెండర్ సమానత ప్రాతిపదికన పనుల అప్పగింత జరగాలి. ఒక్కోసారి బాలురపట్ల కూడా వివక్షత చూపడం జరుగుతుంది. ఇది కూడా సమంజసం కాదు.

- మీ దైనందిన జీవితంలో కూడా ఇలాంటి ఉదాహరణలెన్నో మీరు పరిశీలించి ఉండవచ్చు. వాటిని తెలపండి.
- సాధారణంగా పురుషులు / బాలురు చేసే అన్ని పనులు స్త్రీలు / బాలికలు చేయగలరా? అని వ్యక్తంచేస్తూ ఉంటారు. అలాంటి పనులను గుర్తించండి.
- మన సమాజం పురుషులకు మాత్రమే కేటాయించిన పనులు మరియు పురుషులు చేయకూడదని నిర్ణయించిన పనులేవి?
- అదే విధంగా మన సమాజం స్త్రీలకు మాత్రమే కేటాయించిన పనులు మరియు స్త్రీలు చేయకూడదని నిర్ణయించిన పనులేవి?
- మన పరిశీలనలో వివిధ ప్రాంతాలలో, కాలాలలో సమాజం నిర్దేశించుకున్న పనులకు భిన్నంగా స్త్రీలు, పురుషులు చేస్తున్న పనులేవి?

సాధారణంగా పురుషులు / బాలురు చేసే అన్ని పనులు స్త్రీలు / బాలికలు చేయగలరా? అని అనుమానం వ్యక్తం చేస్తూ ఉంటారు. స్త్రీలు దృఢంగా ఉండరని, పుకార్లు వ్యాపింపజేస్తారని, కొన్ని రకాల ఉద్యోగాలు వాళ్లు చేయలేరని, పురుషులు సిగ్గుపడరని, ప్రేమగా ఉండలేరని, కండల శరీరం వీరికి మాత్రమే సొంతమని భావిస్తారు. కాని ఇది సరికాదు. స్త్రీలు, పురుషులు ఇరువురిలో ఆ లక్షణాలు ఉంటాయి. పురుషులు చేసే అన్ని పనులు స్త్రీలు, స్త్రీలు చేయగల అన్ని పనులు (లింగపరమైనవి కాకుండా) పురుషులు చేయగలరు. ఉదా: కుస్తీ పోటీలలో ఇటు స్త్రీలు, అటు పురుషులు ఇరువురు పాల్గొంటారు. కాని మన సమాజం స్త్రీలు కొన్ని పనులు చేయరాదని భావిస్తుంది. అదేవిధంగా పురుషులు కొన్ని పనులు చేయడాన్ని (ఉదా: వంట చేయడం) తక్కువగా చూస్తుంది.

అదే విధంగా పాఠశాలల్లో కూడా బాలురు మాత్రమే చేయగలిగేవి, బాలికలు మాత్రమే చేయగలిగేవి అని లేదా బాలురు చేయకూడనివి, బాలికలు చేయకూడనివి అని నిర్ధారించడం సరికాదు.

- మీ పాఠశాలలో వివక్షత లేకుండా జెండర్ సమానత కోసం మీరు చేపట్టే అంశాలేవి?
- జెండర్ ఆధారంగా నిర్ధారించబడిన పాఠశాల పనులలో మీరేం మార్చాలనుకుంటున్నారు? ఇతరులలో ఏఏ మార్పులు రావాలని కోరుకుంటున్నారు?

మన సమాజంలో జెండర్‌తోపాటు లింగ వివక్షత కూడా ఉంది. ఆడపిల్ల అని అబార్షన్ చేయించడం, ఆడపిల్లను అమ్ముకోవడం, ఆడపిల్లను వదలివేయడం, ఆడపిల్లను చదివించకపోవడం, అబ్బాయితో సమానంగా అవకాశాలు ఇవ్వకపోవడం, ప్రేమ పేరుతో మోసం చేయడం, వ్యభిచారం చేయించడం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం, కట్నం అడగడం, విధవకు గౌరవం ఇవ్వకపోవడం వంటి ఎన్నో వివక్షతలు ఉన్నాయి.

జెండర్ సమానత సాధించుటకు పాఠశాల కార్యక్రమాల నిర్వహణలో వివక్షత లేకుండా చూడాలి. సమానత కోసం విద్య ఒక సాధనం అని గుర్తించాలి. వివక్షతను నిర్మూలించే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. కొన్ని సందర్భాలలో, వివక్షతను తొలగించుటకు చేపట్టవలసిన అంశాలను పరిశీలిద్దాం.

| క్ర.సం. | **వివక్షత సన్నివేశాలు** | **వివక్షత తొలగింపుకు చేయవలసింది** |
|---|---|---|
| 1 | బాలికలను గంట కొట్టనివ్వకపోవడం | బాల, బాలికలు అందరికీ సమానంగా అవకాశం ఇవ్వడం |
| 2 | ఊడ్చే, కడిగే పనులు బాలికలకు అప్పగించడం | విద్యార్థుల ఆసక్తి ఆధారంగా పనులు కేటాయించడం – బాలికలకు ప్రత్యేకంగా పనులు అప్పగించకపోవడం |
| 3 | బాలికల ఆటలు, బాలుర ఆటలు అని ఆటలను వేరుచేయడం | బాలురు, బాలికలకు ఆసక్తి ఉన్న అన్ని ఆటలు ఆడించడం |
| 4 | బోధనలో బాలురను సంబోధించే పదాలు వాడడం | బాలురు, బాలికలు ఇరువురిని సంబోధించే పదాలు వాడడం |
| 5 | బాలికలతో బాలురను కొట్టించడం | బాలురను అవమానించేందుకు బాలికలస్థాయిని తక్కువ చేయకపోవడం |
| 6 | తక్కువ చేయడానికి, నిందించడానికి బాలికలకు సంబంధించిన పదాలు వాడడం | అంశంపై స్పష్టంగా మాట్లాడడం, బాలురు, బాలికలకు సంబంధించిన పదాలు వాడకపోవడం |
| 7 | | |
| 8 | | |
| 9 | | |
| 10 | | |

ఖాళీలలో మీ అనుభవంలోకి వచ్చిన మరిన్ని వివక్షత సన్నివేశాలను పేర్కొని, వివక్షతను తొలగించుటకు చేయవలసిన చర్యలను తెలపండి.

పాఠశాలతోపాటు సమాజం, కుటుంబంలోని వివక్షతలను కూడా ప్రస్తావించి వాటిపట్ల బాలురు, బాలికలు ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలి. ఉదా: అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి, అబ్బాయిలను ఫీజు కట్టి ప్రైవేటు పాఠశాలలకు పంపడం. పాఠశాలల్లో జెండర్ సంబంధ సౌకర్యాలు కల్పించడం కూడా ముఖ్యం. టాయిలెట్లు, నీరు, శానిటరీ నాప్‌కిన్స్ పారవేసే ఏర్పాట్ల వంటివి తగు సంఖ్యలో కల్పించాలి.

## జెండర్ సమానత – తరగతి గది ప్రక్రియలు

పాఠశాల నిర్వహణాంశాలతో పాటు తరగతి గది ప్రక్రియలు కూడా జెండర్ సమానతను ప్రతిబింబించాలి. తరగతి నాయకులుగా బాలురకు ప్రాధాన్యతనివ్వడం, తరగతిని శుభ్రంగా ఉంచే బాధ్యతను బాలికలకు ఇవ్వడం వంటివి వివక్షతకు ఉదాహరణలు. పాఠ్యాంశ వివరణ సమయంలో మౌఖికంగా లేదా రాతపూర్వకంగా వాడే వాక్యాలు, ఇచ్చే ఉదాహరణలలో సాధారణంగా బాలురు / పురుషులను సూచించే వాక్యాలే ఉంటాయి. వీటిని నివారించాలి. గ్రూపు, తరగతి కృత్యాలలో, ప్రయోగాలు–క్షేత్ర పరిశీలనలు, ప్రాజెక్టు పనుల వంటి సందర్భాలలో కూడా బాలికలకు సమాన ప్రాధాన్యతనివ్వాలి. పటాలు ఉపయోగించడంలో, పాఠ్యాంశాల ప్రదర్శనలలో, గ్రూపుకు నాయకత్వం వహించడంలో బాలికలకు తగినన్ని అవకాశాలివ్వాలి.

## సంక్షిప్త సారాంశం

సాధారణంగా లింగం (Sex), జెండర్ (Gender) రెండు పదాలు ఒకటే అనే అపోహ ఉంటుంది. లింగం (Sex) శారీరక నిర్మాణ సంబంధ అంశం. జెండర్ సామాజికంగా ఆపాదించబడినది. లింగం పుట్టుకతో నిర్ధారించబడి, సాధారణంగా మార్చడానికి అవకాశంలేని అంశం. జెండర్ మన ప్రవర్తనను, మన ఆలోచనా విధానాలను వ్యక్తీకరిస్తుంది. వివిధ సమాజాలలో, దేశాలలో, సంస్కృతులలో, కాలాలలో జెండర్ ధోరణులు వేర్వేరుగా ఉంటాయి. ఇవి కాలంతోపాటు మారతాయి.

కుటుంబం, సమాజంలో మాదిరిగానే పాఠశాలల్లో కూడా వివక్షత ఉంటుంది. ఎందుకంటే పాఠశాల అనేది సమాజం యొక్క సూక్ష్మరూపం. పాఠశాలలో బాల, బాలికలతో వ్యవహరించే విధానం, వారికి అప్పగించే పనులు కూడా వివక్షతతో ఉండరాదు. బెల్‌కొట్టడం, సామగ్రి తేవడం వంటివి బాలురకు కేటాయించి; ఊడ్వడం, వండడం వంటివి బాలికలకు కేటాయించరాదు. బాలురు, బాలికలు, పురుషులు – స్త్రీలు పాఠశాలలో, కుటుంబంలో, సమాజంలో ఏ పనులు అప్పగించినను చేయగలరని గుర్తించాలి.

జెండర్ ఆధారంగా బాల–బాలికల పట్ల అసమానత పాటిస్తే, వారికి చెందిన హక్కులను నిరాకరిస్తే అది జెండర్ ఆధార వివక్షతకు దారి తీసి వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. పాఠశాల ముందుగా జెండర్ ఆధారిత వివక్షను దూరం చేయాలి. సమానత కోసం విద్య అని గుర్తించాలి. టీచర్లు తమ నమ్మకాలు, పక్షపాతాలు వదులుకొని తాము ముందుగా మారవలసి ఉంటుంది. బాలికల పనులు బాలుర పనులు అని వేర్వేరుగా విభజించరాదు. ఆసక్తిని బట్టి పనులను చేయనివ్వాలి. సంబోధన సమయంలో కూడా జాగ్రత్త వహించాలి. బాలురతో సమానంగా బాలికల ఉదాహరణలివ్వాలి. బాల, బాలికలు వారి శక్తి సామర్థ్యాల మేరకు అభివృద్ధి చెందడం, సమాన హక్కు మరియు అవకాశాలు పొందడం, విధానాలు, కార్యక్రమాలు, వనరుల కేటాయింపు

మరియు ప్రయోజనాలు పొందడంలో సమానత కలిగి ఉండడమే జెండర్ సమానత. పాఠశాల స్థాయిలో బెదిరింపులు, శారీరక దండన, మాటలతో మానసికంగా గాయపడేట్లు తిట్టడం వంటివి జరగరాదు. విద్యార్థుల ప్రవర్తనను ప్రభావితం చేయునట్లుగా టీచర్ల ప్రవర్తన ఉండాలి. ఎందుకంటే విద్యార్థులు నిరంతరం టీచర్ల ప్రవర్తనను గమనించి తాము అనుసరించే ప్రయత్నం చేస్తారు. బాలురతో దురుసుగా, బాలికలతో సున్నితంగా లేదా ఇరువురితో దురుసుగా ప్రవర్తించడం వంటివి చేయరాదు. ముఖ కవళికలు, భాష, శరీర కదలికలు సరిగ్గా ఉండాలి. ఎందుకంటే ఇవన్నీ పిల్లలపై ప్రభావం చూపుతాయి. కాబట్టి పాఠశాల నాయకులు జెండర్ సమానతతో పాఠశాల కార్యక్రమాలు నిర్వహింపబడునట్లుగా చేసి విద్యార్థులు, టీచర్లు ద్వారా సమాజానికి మార్గనిర్దేశం చేసే బాధ్యతలను స్వీకరించి, అమలుచేయవలసి ఉంది.

# 2. పాఠశాల కార్యక్రమాలలో జెండర్ సమానత

## అభ్యసన ఫలితాలు

1) పాఠశాలలో జెండర్ సమానత అవసరమైన కార్యక్రమాలను గుర్తిస్తారు.
2) పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో జెండర్ సమానతను ప్రోత్సహిస్తారు.
3) పాఠశాలలో నిర్వహించే ఆటలో జెండర్ వివక్షత లేకుండా చూస్తారు.

## కీలక పదాలు

సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, జాతీయ దినోత్సవాలు, వార్షికోత్సవం, పాఠశాల ఉత్సవాలు, ప్రచార ప్రసార సాధనాలు.

## ఉపోద్ఘాతం

బాలల సర్వతోముఖాభివృద్ధి వివిధ సబ్జెక్టులను చదవడం, వాటిలో మంచి మార్కులు, ర్యాంకులు, గ్రేడులు సాధించడంపైనే ఆధారపడిలేదు. బాలల సర్వతోముఖాభివృద్ధి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, భావోద్వేగపరంగా ఎదగడంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి బాలలు సబ్జెక్టుల అభ్యసనంతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనాలి. వీటన్నింటికీ పాఠశాల అవకాశం కల్పించాలి. బాలలలో అంతర్గత శక్తులు ఉంటాయి. బాలల్లోని నైపుణ్యాలను గుర్తించి వెలికితీసి, ప్రోత్సహించి, అభ్యాసం కల్పించడం ద్వారా ఆయా నైపుణ్యాలలో వారిని నిష్ణాతులుగా చేయవచ్చు. ఇందుకు పాఠశాల వేదిక కావాలి. పాఠశాల నాయకులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో బాలల నైపుణ్యాలను వెలికితీసి, ప్రోత్సహించే కార్యక్రమాలను పాఠశాలలో అమలుచేయాలి. ఈ అన్ని కార్యక్రమాల అమలులో జెండర్ వివక్షత, లింగ వివక్షత లేకుండా చూడాలి. సామాజికంగా ఆపాదించబడ్డ జెండర్ మూసధోరణులను, వివక్షతను తొలగించేలా పాఠశాల కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలల్లో నిర్వహించే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో సాధారణంగా వివక్షత ఉంటుంది. జాతీయ దినోత్సవాల సందర్భంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా పాఠశాల

వార్షికోత్సవం, బాలల దినోత్సవం, ఇతర ప్రత్యేక రోజు సందర్భాలలో కూడా వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భాలలో బాలురు, బాలికలకు వేర్వేరు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కేటాయించే పాత్రలు ఇవ్వడంలో వివక్షత చూపరాదు. పాఠశాల అనుసరించే జెండర్ సమానత విధానాలు వారిపై మరింత బలమైన ప్రభావాన్ని చూపి సమాజంలో, జీవితంలో సమభావన కొనసాగేందుకు దోహదపడతాయి.

## జెండర్ సమానత – క్రీడలు

బాలలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే వారు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, భావోద్వేగపరంగా అభివృద్ధి చెందవలసి ఉంటుంది. ఇందుకు పాఠ్యాంశాలతోపాటు, పాఠ్యేతర, సహ–పాఠ్యాంశాలు కూడా తోడ్పడతాయి. ప్రస్తుతం పాఠ్యేతర, సహపాఠ్యాంశాలను కూడా పాఠ్యాంశాలుగా (Curricular areas) పరిగణించడం జరుగుచున్నది. కాబట్టి ఈ అంశాల నిర్వహణను పాఠశాల తప్పక చేపట్టవలసి ఉంటుంది. జాతీయ దినోత్సవాలు, సైన్స్‌ఫేర్, బాలల దినోత్సవం, వార్షికోత్సవం, ప్రముఖుల పుట్టిన రోజులు సందర్భాన్ని పురస్కరించుకొని సాధారణంగా పాఠశాలల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా లింగపరంగా, జెండర్ పరంగా వివక్షత చూపే అంశాలు లేకుండా చూడాలి. ఈ ప్రత్యేక సందర్భాలకు మరియు విద్యార్థులలో ఆయా అంశాలలో నైపుణ్యం పెంపొందించేందుకు నిర్వహించే అభ్యాస కార్యక్రమాల్లో కూడా వివక్షత లేకుండా చూడాలి.

- మీ పాఠశాలలో ఆడించే ఆటలేవి?
- వీటిలో బాలురకు, బాలికలకు కేటాయించిన క్రీడలేవి?
- వీటిలో బాల, బాలికలిరువురికి కేటాయించిన క్రీడలేవి?

సాధారణంగా పాఠశాలల్లో కబడ్డీ, క్రికెట్, ఖోఖో, పరుగుపందెం, లాంగ్‌జంప్, స్కిప్పింగ్, వాలీబాల్, టెన్నిస్ వంటి ఆటలు ఆడిస్తుంటారు. వీటిలో కొన్ని ఆటలను ప్రత్యేకంగా బాలికలకు ఆపాదిస్తారు. సాధారణంగా క్రికెట్ బాలురకు ఆడించి, బాలికలను విస్మరిస్తారు. కొన్ని ఆటలను బాలికల ఆటలుగా బాలుర ఆటలుగా విభజిస్తారు. ఇది సరికాదు. బాలికల ఆట అని ఆపాదించబడ్డ ఆటను బాలురు ఆడితే వెక్కిరించడం, ఎగతాళి చేయడం అలాగే బాలురకు ఆపాదించబడ్డ ఆటను ఆడపిల్లలు ఆడితే బాలుర ఆటలు బాలికలు ఆడరాదని అనడం జరుగుతుంటుంది. బాలికలు కబడ్డీ ఆడితే 'మగరాయుళ్ల' ఆట ఆడరాదని ఖో, ఖో, స్కిప్పింగ్ ఆడాలని నిర్దేశిస్తుంటారు.

- బాలికలు కబడ్డీ, క్రికెట్, జిమ్నాస్టిక్స్, లాంగ్‌జంప్, పరుగుపందెం వంటి క్రీడల్లో నైపుణ్యం చూపగలరా?

ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు స్త్రీలు, బాలికలు అన్ని క్రీడలు ఆడగలరని మనకు తెలుస్తుంది. ఏ ఆటలు ఎవరు ఆడాలనేది మన ఆలోచనావిధానమే. కాని బాలురు, బాలికలు ఇరువురు అన్ని ఆటలు ఆడగలరని, నైపుణ్యం చూపగలరని మనకు తెలుసు. పాఠశాలలో బాలురు ఆడే అన్ని ఆటలు బాలికలు కూడా ఆడగలరు. అలాగే బాలికలు

ఆడే అన్ని ఆటలు బాలురు ఆడగలరు. కాబట్టి ఆట పరంగా ఎలాంటి వివక్షత చూపరాదు. మిక్స్‌డ్ డబుల్స్ వంటివి ఆటలలో సాధారణంగా ఆడ, మగ కలిసి ఆడే ఆటలు. కాబట్టి విద్యార్థులలో నైపుణ్యాన్ని గుర్తించి అభ్యాసం కల్పించాలి. దేహదారుఢ్యం, ఆటలలో నైపుణ్యాలు కలిగి ఉండడమనేది బాల, బాలికలిరువురూ అవసరమే. క్రీడా పోటీల సమయంతో పాటు రోజువారి ఆటల అభ్యాస సమయంలో కూడా బాల, బాలికల మధ్య వివక్షత చూపరాదు. పాఠశాలలో ఆడించే, పోటీలు నిర్వహించే ప్రతీ ఆటలో బాలురు, బాలికలు ఇరువురికీ అవకాశం కల్పించాలి.

- ప్రస్తుతం మీ పాఠశాలలో అనుసరిస్తున్న విధానమేమిటి?
- జెండర్ సమానత ఆధారంగా మీరు చేయాలనుకొంటున్న మార్పులేవి?
- ఈ మార్పుల ద్వారా మీరు ఎదురవుతాయనుకుంటున్న అడ్డంకులేవి?
- వాటిని అధిగమించుటకు మీరు అనుసరించానులకుంటున్న అంశాలేవి?

సమాజంచే ఆపాదించబడి తరతరాలుగా నమ్ముతున్న, ఆచరిస్తున్న వాటిని ఒకేసారిగా మార్చే ప్రయత్నం చేయడంవల్ల ప్రతిఘటన, వ్యతిరేకత వస్తుంది. జెండర్ సమానత విషయంలో కూడా మార్పులు అమలుచేయడంలో అడ్డంకులు ఎదురుకావచ్చు. కాబట్టి ఈ అంశంపై పూర్తి అవగాహన చేసుకోవడం, అందరికి అవగాహన కల్పించడం ముఖ్యం. స్త్రీలు / బాలికలు ఇల్లు విడిచి బయటకు రావడం, విద్యనభ్యసించడం, వివిధ సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం అనేవి ప్రారంభంలో ఒడిదొడుకులను ఎదుర్కొని ఆ తర్వాత సమాజంచే ఆమోదించబడ్డాయి. కాబట్టి అవగాహన కల్పించడం అనేది ముఖ్యమైన అంశమని గుర్తించాలి.

## జెండర్ సమానత – సాంస్కృతిక కార్యక్రమాలు

పాఠశాలల్లో నిర్వహించే వివిధ ఉత్సవాల సమయంలో, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ సమయంలో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

- మీ పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలేవి?
- వాటిలో బాలురు, బాలికలకు కేటాయించే అంశాలేమిటి?
- అన్ని అంశాలను బాలబాలికలు ఇరువురికి కేటాయించగలమా?

ఈ సందర్భంలో సంప్రదాయ నృత్యం వంటి వాటిని బాలికలకు కేటాయించడం జరుగుతుంది. స్త్రీల ప్రాధాన్యత తక్కువగా చూపే పాత్రలు కలిగిన నాటకాలు, కార్యక్రమాలు లేకుండా చూడాలి. స్త్రీలను లాలిత్యంగా, పురుషులను వీరులుగా చూపడం కాకుండా ఇరువురిలో అన్ని అంశాలు ఉంటాయని ప్రతిఫలించే విధంగా కార్యక్రమాలు ఉండాలి. వ్యాఖ్యాతలుగా బాలురకు ప్రాధాన్యతనివ్వడం చేయరాదు. బాలబాలికలిరువురికీ ప్రాధాన్యత ఇవ్వాలి. స్వాగత కార్యక్రమాలలో బాలికలను ముందుంచడం చేస్తూ ఉంటారు. ఇందులో బాలురకు కూడా చోటివ్వాలి.

బాలురకు ఎక్కువ సమయం, ఎక్కువ కార్యక్రమాలు; బాలికలకు తక్కువ సమయం, తక్కువ కార్యక్రమాలు కేటాయించరాదు. ధరించే దుస్తుల విషయంలో ఆటంకాలు కల్పించరాదు. ప్యాంటు, టీ షర్టు ధరించడం వంటి వాటిపట్ల అభ్యంతరాలు చూపరాదు. కో–ఎడ్యుకేషన్ పాఠశాలల్లో బాలికలకు అవకాశం ఇవ్వకుండా బాలురను బాలికల వేషం వేయించడం చేయరాదు. స్టేజి అలంకరణ వంటి వాటిలో బాలికలకు కూడా అవకాశం ఇవ్వాలి. బాల, బాలికలకు కూడా జెండర్ పరమైన అంశాలపై అవగాహన కల్పించాలి.

- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం మీ పాఠశాలలో అనుసరిస్తున్న విధానాలేమిటి?
- మీరు జెండర్ సమానత కోసం తీసుకురాలవానుకుంటున్న మార్పులేవి?
- మార్పుల సందర్భంగా ఎదురుకావచ్చని మీరు భావిస్తున్న అడ్డంకులేమిటి?
- ఆ అడ్డంకులను మీరు ఏవిధంగా ఎదుర్కోవాలనుకుంటున్నారు?
- అడ్డంకులను కల్పించే వారికి మీరు ఏ విధమైన అవగాహనను కల్పిస్తారు?

మన ఆలోచనలను, భావాలను ప్రభావితం చేయడంలో ప్రస్తుతం ప్రచార, ప్రసార సాధనాలు కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. ఇతర అన్ని అంశాల మాదిరిగానే జెండర్ సమానత విషయంలో ప్రచార, ప్రసార సాధనాలలో కూడా సాధారణంగా వివక్షత కనబడుతుంది. పురుషులు ఉపయోగించే సామగ్రి ప్రకటనలను కూడా స్త్రీలతో ప్రచారం నిర్వహింపజేస్తున్నారు. స్త్రీ, పురుషులు ఇరువురు ఉపయోగించే సామగ్రికి కూడా స్త్రీలే ప్రకటనకర్తలుగా ఉంటున్నారు. పిల్లలకు సంబంధించి శక్తినిచ్చే పానీయాలు, ఆహారం వంటి ప్రకటనలలో కూడా ఎక్కువగా బాలురు కనిపిస్తారు.

బాలలకు సంబంధించిన ఎక్కువ ప్రకటనలలో సాధారణంగా బాలుర పాత్ర ఎక్కువగా ఉంటుంది. పాఠశాల ప్రవేశం, శక్తినిచ్చే ఆహారం, పానీయాలు, ఆటు, వినోదాలు, సందర్శించే ప్రదేశాలు, ఇలా దేనికి సంబంధించిన ప్రకటనలలో అయినా బాలురకు ఎక్కువ సంఖ్యలో, ఎక్కువ సమయం కేటాయించడం జరుగుతున్నది. ఇదంతా జెండర్ సంబంధ వివక్షతనే. పిల్లల పాఠశాల సామగ్రి ప్రకటనలలో ఉండే పెన్నులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రికి సంబంధించిన ప్రకటనలలో బాలురకు ప్రాధాన్యత ఉంటుంది. ఇవన్నీ చిన్నప్పటి నుండే విద్యార్థులలో జెండర్ వివక్షతను కలిగిస్తాయి.

- మీరు ఒకరోజు చూసిన ప్రకటనలలో జెండర్ వివక్షతను చూపే వాటిని నమోదు చేయండి.
- ఆయా ప్రకటనలను జెండర్ సమానత ఆధారంగా రూపొందించవచ్చా? ఆలోచించండి.
- విద్యార్థులను ఒక రోజంతా బాలలకు సంబంధించి వచ్చే ప్రకటనలను పరిశీలించమనండి. వాటిలో ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఉందో నోట్ చేయమనండి.

జెండర్ వివక్షతను ప్రదర్శించే ప్రకటనలను జెండర్ సమానతలతో ఎలా తయారుచేయవచ్చో చర్చించండి. వారితో తయారుచేయించండి. మీరు మార్గదర్శనం చేయండి. వ్యాపార ప్రకటనలతోపాటు సీరియళ్ళు, సినిమాలు, పాటలు, కార్టూన్లు, గేమ్‌షోలు, ప్రత్యేక కార్యక్రమాలను పరిశీలించండి. అదేవిధంగా అమ్మాయిలను ఏడిపించే సన్నివేశాలు కూడా బాలురు, బాలికలు మొత్తం సమాజంపై ప్రభావం చూపుతాయి. బాలురు – బాలికలను ఏడిపించడం, వ్యాఖ్యానించడం, టీజ్ చేయడం, వారితో వెకిలిగా ప్రవర్తించడం సమంజసమనే ధోరణిలో ఉన్న ప్రకటనలు, సినిమాలు, సీరియళ్లు – ప్రచార ప్రసార మాధ్యమాలలో వచ్చే అన్ని అంశాలపై బాల–బాలికలకు అవగాహన కల్పించాలి.

## సంక్షిప్త సారాంశం

బాలల సర్వతోముఖాభివృద్ధికి పాఠ్యాంశాలతోపాటు పాఠ్యేతర, సహ–పాఠ్య కార్యక్రమాలు తప్పనిసరిగా అవసరం. ప్రస్తుతం పాఠ్యేతర, సహ–పాఠ్య కార్యక్రమాను పాఠ్యభాగాలుగానే (Curricular Areas) పరిగణిస్తున్నారు. బాలల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాప్రదర్శనల అభ్యాసం నిరంతరం పాఠశాలల్లో జరగాలి. ఈ సందర్భాలలో జెండర్ వివక్షత లేకుండా చూడాలి. సాధారణంగా ఆటలను బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్దేశించడం జరుగుతుంది. అలాకాకుండా బాల, బాలికలిరువురికీ వారి నైపుణ్యం, ఆసక్తుల ఆధారంగా అభ్యాసం కల్పించి, ప్రదర్శనలలో, పోటీలలో పాల్గొనేలా వీలు కల్పించాలి. బాలుర ఆటలు, బాలికల ఆటలు అనే విభజన చూపరాదు. ఆటల సందర్భంలో వాడే సామగ్రి, అవకాశాల కల్పన, బాల–బాలికలిరువురిని భాగస్వాములుగా చేయడం వంటి వాటిలో వివక్షత చూపకుండా జెండర్ సమానత పాటించాలి. బాలల కళా నైపుణ్యాలను గుర్తించి నృత్యం, నాటకం, ఏకపాత్రాభినయం ఇలా అన్నింటిలో బాల–బాలికలిరువురికీ సమాన సంఖ్యలో, సమాన ప్రాధాన్యతనివ్వాలి. కళాప్రదర్శనలో, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో, దుస్తులు, పాత్రల ఎంపికలో ఆసక్తిని, నైపుణ్యాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి. బాలబాలికల పాఠశాల (Co–Education) లో బాలురు బాలికలు అందుబాటులో ఉన్నప్పుడు పురుష వేషానికి స్త్రీలను, స్త్రీల వేషానికి పురుషులను తీసుకోవడం సమంజసమా? కళాంశాలలో వివక్షత చూపే అంశాలు ఉండరాదు. ప్రస్తుతం ప్రచార, ప్రసార సాధనాలు సమాజంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి. వీటిలో సాధారణంగా స్త్రీలని / బాలికలను ప్రదర్శన వస్తువుగా చూపిస్తున్నారు. పురుషుల సామగ్రికి కూడా స్త్రీలను ప్రకటనల్లో చూపిస్తున్నారు. అదేవిధంగా బాలలకు సంబంధించి శక్తినిచ్చే పానీయాలు, ఆహారపదార్థాలు, విద్యకు సంబంధించిన సామగ్రి, క్రీడలు ఇలా అన్నింటిలో బాలురకు ప్రాధాన్యతనిచ్చే ప్రకటనలు ఎక్కువగా ఉంటున్నాయి. దాంతో అవి బాలబాలికలు, సమాజంపై తీవ్రప్రభావం చూపి వివక్షతకు కారణమవుతున్నాయి. కాబట్టి జెండర్ సమానత సాధించేటట్లుగా ప్రచార, ప్రసార సాధనాల పనితీరులో మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

# 3. జెండర్ పరంగా మూసధోరణు – వివక్షత

## అభ్యసన ఫలితాలు

1) జెండర్‌పర మూసధోరణులను వివరిస్తారు.
2) జెండర్ పరంగా వ్యక్తులు, కుటుంబం, పాఠశాల, సమాజం చూపే వివక్షతను గుర్తిస్తారు.
3) జెండర్ మూసధోరణులు, వివక్షతకు వ్యతిరేకంగా జెండర్ సమానతకు కృషిచేస్తారు.
4) జెండర్ సమానతకు కార్యాచరణను రూపొందించి అమలుచేస్తారు.

## కీలక పదాలు

జెండర్‌పరం, మూసధోరణులు, కేస్‌స్టడీ

## ఉపోద్ఘాతం

సాధారణంగా జెండర్ పరంగా వ్యక్తులు, కుటుంబం, పాఠశాల, సమాజ సభ్యులు మూసధోరణులను కలిగి ఉంటారు. ఈ మూసధోరణులే వివక్షతకు కారణమవుతున్నాయి. వీటివల్ల కొంతమంది ఎక్కువ అవకాశాలు పొందడం జరుగుతున్నది. మిగిలిన వారికి అవకాశాలు అందుబాటులో లేక నైపుణ్యం ఉన్నను వెనుకబడిపోవడం లేదా వాటిలో ప్రవేశం పొందకపోవడం జరుగుతున్నది. వ్యక్తులు తాము సాధించే అవకాశాలపై తక్కువగా ఆధారపడి, అందుబాటులోగల అవకాశాలపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తుంది. ఇది కుటుంబం నుండి మొదలుకొని పాఠశాల, సమాజం అంతా విస్తరించి ఉంది. ప్రస్తుతం జెండర్‌పరమైన అవగాహన పెరిగి వివక్షతను తొలగించి జెండర్ సమానతకు కృషి జరగడం ప్రారంభమయ్యింది. మనం అలాంటి కొన్ని సంఘటనలను పరిశీలిద్దాం. వీటికి పరిష్కారమార్గాలు ఆలోచిద్దాం. అందుకు సహాయపడే వ్యక్తులు, సంస్థల గురించి తెలుసుకొని వాటి సహాయం పొందుదాం. కుటుంబం నుండి మొదలుకొని పాఠశాల, సమాజం అంతటా ఇలా సహాయం చేసే వ్యక్తులు, సంస్థలు ఉన్నాయని గుర్తించాలి. వాటి సహకారం తీసుకోవాలి.

## జెండర్‌పరమైన మూస ధోరణులు – తీసుకోవలసిన చర్యలు

జెండర్ ఆధారిత వివక్ష బాలికలతోపాటు, బాలురు కూడా ఎదుర్కొంటున్నారు. వ్యక్తులు, కుటుంబం, పాఠశాల, సమాజం ఇవన్నీ వివక్షతకు కేంద్రాలు మరియు వివక్షతను రూపుమాపడానికి తోడ్పడేవి కూడా. ఇప్పుడు మనం కొన్ని కేస్‌స్టడీలు చూద్దాం. వీటిలో సమస్యను గుర్తించడం, సమస్య కారణాలను విశ్లేషించడం, సమస్య పరిష్కార మార్గాల గురించి ఆలోచించడం, ఇందుకు తోడ్పడే వ్యక్తులు, సంస్థలను గుర్తించడం చేద్దాం. అలానే ఆ సమస్య మనకు, మన తోటివారికి సంభవిస్తే లేదా మన పరిధిలో సంభవిస్తే మనం చూపించగల పరిష్కార మార్గాల గురించి కూడా ఆలోచిద్దాం. సమస్య పరిష్కార మార్గంలో వెళ్లడానికి ఇవి మనకు ఎంతగానో తోడ్పడతాయి.

ఈ కేస్‌స్టడీలు – వీటి విశ్లేషణ సూచించే పరిష్కారమార్గాలే జెండర్‌పర మూసధోరణులు వివక్షతలను ఎదుర్కొని జెండర్ సమానతకు దారితీస్తాయని ఆశిద్దాం.

**కేస్ స్టడీ – 1** : ఆనందను 6వ తరగతిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఆనంద, తన అన్నను ప్రైవేట్ పాఠశాలలో కొనసాగిస్తూ, తనను మాత్రం ప్రభుత్వ పాఠశాలలో చేర్చడాన్ని వ్యతిరేకించింది. తల్లిదండ్రులు అబ్బాయిని ప్రైవేట్ పాఠశాలలోనే కొనసాగిస్తామని, అమ్మాయిని మాత్రం ప్రభుత్వ పాఠశాలలోనే చేరుస్తామని స్పష్టం చేశారు. కాని ఆనంద తన అన్న సహకారం తీసుకొని తల్లిదండ్రులతో మాట్లాడి తాను నిర్ణయించుకున్న పాఠశాలలో చేరింది.

**విశ్లేషించండి – చర్చించండి :**

- పాఠశాల నాయకులుగా ఆనందకు, ఆమె తల్లిదండ్రులకు మీరిచ్చే సలహా ఏమిటి?
- ఉపాధ్యాయులుగా ఆనందకు, ఆమె తల్లిదండ్రులకు మీరిచ్చే సలహా ఏమిటి?
- మీరు ఆనంద స్థానంలో ఉంటే ఏం చేస్తారు?
- ఆనంద మీ స్నేహితురాలయితే మీరిచ్చే సలహా ఏమిటి?
- ఆనంద తన సమస్య పరిష్కారానికి కృషి చేసిన విధానంపై మీ అభిప్రాయమేమిటి? ఇంకా ఏం చేయాలని మీరు భావిస్తున్నారు?

బాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం, అబ్బాయిలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడం వివక్షతను సూచిస్తుంది. సాధారణంగా బాలికలు పెండ్లి తర్వాత తమ ఇంటికి చెందనివారని, వారు భావి జీవితంలో స్థిరపడినను తమ కుటుంబానికి సహాయం చేయరని, పెళ్లి తర్వాత మరో ఇంటికి వెళుతుందనే భావనతో బాలికలకంటే బాలురకు తల్లిదండ్రులు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. కాని పిల్లల అభివృద్ధిలో తేడాలు చూపరాదు. బాలబాలికలిరువురికి సమాన అవకాశాలు కల్పించాలి. ప్రస్తుత చట్టాల ప్రకారం తల్లిదండ్రులు ఆస్తిలో బాల–బాలికలు ఇరువురికీ సమానహక్కు ఉంటుంది. కాబట్టి ఒకరు ఆదాయవనరుగా, మరొకరు ఖర్చుగా భావించడం సరికాదు. ప్రస్తుతం బాలికలు చదువు, క్రీడలు తదితర అంశాలలో రాణించి తల్లిదండ్రులకు చేయూతనందిస్తున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. కాబట్టి బాల–బాలికల చదువుల విషయంలో వివక్షత చూపరాదు. ఇరువురికీ సమాన అవకాశాలు కల్పించాలి.

**కేస్ స్టడీ – 2** : ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్న యమున, పున్నమిలను వారి ఇంటి దగ్గరలో అన్ని సౌకర్యాలు గల కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో 6వ తరగతిలో చేర్చాలని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సూచించారు. కాని యమున తల్లిదండ్రులు మాత్రం ఇంటి దగ్గరలో ఉన్న కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో కాకుండా దూరంగా ఉన్న బాలికల పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం యమునకు అసంతృప్తిని కలిగించింది. ఈ నిర్ణయంతో యమున పాఠశాల కోసం ఎక్కువ దూరం నడవడం లేదా ప్రయాణ సాధనాలపై ఆధారపడవలసి వస్తుంది. పున్నమి మాత్రం దగ్గరలోని కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో చేరింది. యమున తాను చదివిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో తల్లిదండ్రులను ఒప్పించి చివరకు దగ్గరలోని కో–ఎడ్యుకేషన్ పాఠశాలలోనే చేరింది.

**విశ్లేషించండి – చర్చించండి :**

- పాఠశాల నాయకులుగా యమునకు ఆమె తల్లిదండ్రులకు మీరిచ్చే సలహా ఏమిటి?
- ఉపాధ్యాయులుగా యమునకు, ఆమె తల్లిదండ్రులకు మీరిచ్చే సలహా ఏమిటి?
- యమున స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?
- యమున మీ స్నేహితురాలయితే మీరిచ్చే సలహా ఏమిటి?
- యమున సమస్య పరిష్కారానికి కృషి చేసిన విధానంపై మీ అభిప్రాయమేమిటి? ఇంకా ఏం చేయాలని మీరు భావిస్తున్నారు?

బాలికల విషయంలో రక్షణ, బాలల వేధింపు తదితర కారణావల్ల, బాల–బాలికలు ఒకే చోట చదవడంవల్ల ఆకర్షణలకు లోనుకావడం వంటి భయాలచేత తల్లిదండ్రులు కో–ఎడ్యుకేషన్ కంటే బాలికలు పాఠశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. కాని తల్లిదండ్రులు సరయిన అవగాహనతో నిర్ణయం తీసుకోవాలి. పాఠశాలలో విద్యార్థులందరికి జెండర్ సమానత, కౌమారవిద్య వంటి అంశాలపై అవగాహన కల్పించాలి. వీటిని ఎదుర్కొనేలా తయారుచేయాలి. నిరంతరం తల్లిదండ్రులు అమ్మాయిలతో, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో చర్చించడం ద్వారా ఈ సమస్యలను రాకుండా చూసుకోవచ్చు. అంతేకాని కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో చేర్చకపోవడం సరికాదు. అందుబాటులో గల సరయిన, మంచి వనరులను ఎన్నుకోవడమే సమంజసం.

**కేస్ స్టడీ – 3** : పున్నమి చదివే కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో బాలురు, బాలికలకు వేర్వేరు సెక్షన్లు కలవు. ఈ విద్యాసంవత్సరం బదిలీపై నూతన ప్రధానోపాధ్యాయులు వచ్చారు. ఆమె బాలురు, బాలికలు ఇద్దరూ ప్రతి సెక్షన్‌లో ఉండేటట్లుగా మార్పులు చేశారు. అప్పటివరకు అబ్బాయిలు, అమ్మాయిలు ఒకరిపై ఒకరు చేసే వ్యాఖ్యలు ముగిసిపోయి, అందరూ కలిసిమెలిసి స్నేహితులుగా మెలుగుతున్నారు.

**విశ్లేషించండి – చర్చించండి :**

- పాఠశాల నాయకులుగా ప్రతి సెక్షన్‌లో బాలురు, బాలికలు చదవడంపై మీ అభిప్రాయమేమిటి?
- ఉపాధ్యాయులుగా ప్రతి సెక్షన్‌లో బాలురు, బాలికలు చదవడంపై మీ అభిప్రాయమేమిటి?
- మీరు ఒకవేళ ఆ పాఠశాలలో చదువుతున్నట్లయితే మీరు దేనికి మద్దతునిస్తారు?
- బాల–బాలికలు వేర్వేరు సెక్షన్లలో చదవాలని నిర్ణయిస్తే ఆ సమస్యను మీరెలా పరిష్కరిస్తారు?

కుటుంబంలో, సమాజంలో చాలా చోట్లా స్త్రీ, పురుషులు, బాల–బాలికలు కలిసి అనేక పనులలో పాల్గొంటున్నారు. తమ చెల్లి, అక్క – తమ తమ్ముడు, అన్నతో కలిసి దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లే పాఠశాలలో కూడా ఆ అవగాహనతో వ్యవహరించగలగాలి. అదే విధంగా పాఠశాలల్లో కూడా బాల–బాలికలను వేర్వేరుగా ఉంచే ప్రయత్నాలు చేయడం సరికాదు. బాల–బాలికలు స్నేహత్వంతో కలిసిమెలిసి అవగాహనతో

ఉండేటట్లుగా ఒకరిపట్ల మరొకరు గౌరవించుకునే విధంగా అందుకు పాఠశాల తగిన వాతావరణం కల్పించాలి. కుటుంబంలో కుటుంబ సభ్యులు ఏ విధంగా అందరూ కలిసిమెలిసి ఉంటారో, అదే విధానంలో పాఠశాల నిర్వహణ జరగాలి. విద్యార్థుల మధ్య పరిచయం, స్నేహతత్వం వారికి అన్ని విషయాలపై సరయిన అవగాహన కలిగేట్లు చేసి, అనవసర వ్యాఖ్యలు చేయకుండా ఉండడానికి కూడా దోహదం చేస్తుంది. విద్యార్థులు తమ చెల్లి / అక్క / అన్న / తమ్ముడు ఆ స్థానంలో ఉంటే ఎలా భావిస్తామనేది ఆలోచించి ప్రవర్తించేలా చూడాలి.

**కేస్ స్టడీ – 4** : విద్యార్థులందరూ ఆటల మైదానానికి చేరుకున్నారు. వాళ్లు స్కిప్పింగ్ ఆడేచోట కొన్ని రాళ్లు ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆ రాళ్లను తొలగించడానికి అబ్బాయిలను పిలిచారు. కాని ఆనంద మనం తీయలేమా, అని వెళ్లి ఒక రాయిని తొలగించడం ప్రారంభించింది. మిగిలిన అమ్మాయిలు ఆమెతో జత కలిశారు. అబ్బాయిలు ఆ ప్రదేశానికి చేరుకునేసరికి మొత్తం రాళ్ళను అమ్మాయిలు తొలగించడం చూసి ఆశ్చర్యపోయారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు తాను అమ్మాయిలను తక్కువ అంచనా వేయడం సరికాదని గ్రహించారు. గతంలో కుస్తీ పోటీలలో బాలికలు పాల్గొనవద్దని చెప్పిన విషయం గుర్తొచ్చింది. ఈసారి తప్పక వారికి కుస్తీలో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకున్నారు.

**విశ్లేషించండి – చర్చించండి :**

- ఆ పరిస్థితిలో ఉపాధ్యాయులుగా మీరుంటే ఏం చేస్తారు?
- ఆనంద స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?
- అబ్బాయిల స్థానంలో మీరు ఉంటే మీరెలా అభిప్రాయపడతారు?
- ఒకవేళ మీరు వ్యాయామ ఉపాధ్యాయులైతే మీరేం చేస్తారు?

తరతరాలుగా మనలో బాలికలు సున్నితంగా, బాలురు దృఢంగా ఉంటారనే అభిప్రాయాలు నాటుకుపోయాయి. కాని గ్రామీణ ప్రాంతాలలో అమ్మాయిలు కట్టెల / గడ్డిమోపు మోయడం, నీటి బిందెలు మోయడం, చాలా బరువులు ఎత్తే పనులు వ్యవసాయంలో, కుటుంబ పనులలో చేయడం సాధారణం. కాని అ అమ్మాయిలే పాఠశాలలో బరువులు ఎత్తే పనులు అబ్బాయిలే చేయాలని అనుకోవడం తరతరాలుగా ఏర్పరుచుకున్న ఒక దురభిప్రాయం. ఇలాంటి పనులు చేయడంలో అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరూ సమానమే. శారీరక శ్రమ విషయంలో అవకాశాలు కల్పిస్తే చాలు. అమ్మాయిలు కూడా అబ్బాయిలతో సమానమే అని గుర్తించాలి. పాఠశాలలో ఆటలు, పనులు బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్ణయించరాదు. అన్ని ఆటలు, పనులు బాల–బాలికలు ఇరువురికి వారి ఆసక్తికి అనుగుణంగా కేటాయించాలి.

**కేస్ స్టడీ – 5** : పాఠశాల వార్షికోత్సవ ప్రణాళికా సమావేశం జరుగుతోంది. ఒక టీచర్ స్టేజిపై ప్రకటన చేసేవారిలో అమ్మాయిలు అవసరం లేదని వాదించింది. మరొక టీచర్ ఆమెను సమర్థించారు. కాని ఆమె మాటను మిగిలిన అందరూ తిరస్కరించారు. అబ్బాయిలతోపాటు అమ్మాయిలు కూడా యాంకర్స్‌గా ఉండాలని నిర్ణయించారు. అలాగే స్త్రీల పాత్రలు అబ్బాయిలు కాకుండా అమ్మాయిలే

పోషించాలని కూడా నిర్ణయించారు. ఆ సంవత్సరము వార్షికోత్సవం గతం కంటే బాగా విజయవంతం అయ్యింది. ఆడపిల్లలు యాంకర్లుగా వద్దని తెలిపిన టీచర్ వారి నాయకత్వ నైపుణ్యాలు, ఆత్మస్థైర్యానికి అబ్బురపడి యాకరింగ్ చేసిన అమ్మాయిలకు తనే సొంతంగా బహుమతి ప్రకటించి, అందరి ముందు అందించారు.

**విశ్లేషించండి – చర్చించండి :**

- ఆ సమావేశ సభ్యులుగా మీరుంటే మీరు వ్యక్తపరిచే అభిప్రాయమేమిటి?
- మీరు అమ్మాయిల స్థానంలో ఉంటే మీరేం అభిప్రాయపడతారు?
- మీరు అబ్బాయిల స్థానంలో ఉంటే, మీరు వ్యక్తపరిచే అభిప్రాయమేమిటి?
- పాఠశాల నాయకులుగా మీ అభిప్రాయమేమిటి?

ప్రస్తుతం ప్రచార – ప్రసార మాధ్యమాలలో స్త్రీలదే ఆధిపత్యం. గతంతో పోలిస్తే యాంకరింగ్‌లో మహిళల సంఖ్య బాగా పెరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా బాలికలు, స్త్రీల పాత్ర ప్రశంసనీయంగా ఉంది. కాబట్టి పాఠశాల కార్యక్రమాలలో బాలికలకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. వాళ్లు ఆత్మస్థైర్యంతో వేదికపైన వందల మంది ముందు తమ నైపుణ్యాలను ప్రదర్శించుటకు అవకాశమివ్వాలి. తద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. కాబట్టి సాంస్కృతిక కార్యక్రమాలు, వేదికపై నిర్వహించే కార్యక్రమాలలో బాలికలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలి. వారిలో పాఠశాల స్థాయి నుండే ఆత్మవిశ్వాసం పెంపొందేలా అవకాశాలు కల్పించాలి.

**కేస్ స్టడీ – 6** : క్రాంతి స్నేహితులతో కలిసి పాఠశాల నుండి ఇంటికి వెళుతోంది. దారిలో కొంతమంది బాలురు వారి గురించి వెకిలిగా మాట్లాడుతూ వేధించడం మొదలుపెట్టారు. దాంట్లో క్రాంతి చదివే పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నారు. వారి వెకిలి చేష్టలు ఇంకా ఎక్కువవడంతో క్రాంతి వారికి ఎదురుతిరిగింది. ఆమెకు మద్దతుగా కొంత మంది బాలికలు వచ్చారు, ఇంకొందరు ఏమనకుండా నిలబడ్డారు. క్రాంతి బృందానికి మద్దతుగా ఒక అబ్బాయి కూడా వచ్చాడు. దీంతో ఆ బాలురు పరుగున అక్కడి నుండి వెళ్ళిపోయారు. క్రాంతి ధైర్యాన్ని, సహాయం చేసిన అబ్బాయిని అందరూ మెచ్చుకున్నారు. తాను ఎన్.సి.సి.లో సభ్యురాలినని, పాఠశాలలో నేర్పిన కరాటే కూడా తనకు వచ్చునని ఆమె అంది. వారికి మద్దతుగా వచ్చిన అబ్బాయి తన చెల్లెళ్ళు అయితే సహాయం చేసే వాడినే కదా అని అంటూ, ఇలాంటివి ఎదుర్కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నాడు. సమస్యలు ఎదురయితే 1098, 100, 181 నెంబర్‌కు సహాయం కోసం ఫోన్ చేయవచ్చు అని తెలిపాడు.

**విశ్లేషించండి – చర్చించండి :**

- ఆ పరిస్థితుల్లో మీరుంటే పాఠశాల నాయకులుగా మీరేం చేస్తారు?
- ఆ సందర్భంలో మీరుంటే ఉపాధ్యాయులుగా మీరేం చేస్తారు?

- వేధించబడే బృందంలో మీరుంటే ఏం చేస్తారు?
- మీ ముందర వేధింపులు జరుగుతుంటే మీరేం చేస్తారు?

ప్రస్తుతం సమాజంలో బాలికలపట్ల వేధింపు నిత్యకృత్యమైపోయాయి. అలా అని బాలికలను ఇంటికి, పాఠశాలకు పరిమితంచేయడం, వారికి నిబంధలను పెట్టడం సరికాదు. అమ్మాయిలలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. ఇందుకు ఆత్మరక్షణ శిక్షణను ఇప్పించాలి. శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దాలి. ఎన్.సి.సి. లాంటి వాటిల్లో సభ్యులుగా చేర్పించాలి. అబ్బాయిలకు వారి ప్రవర్తన బాగుండేలా సూచనలివ్వాలి, అవగాహన కల్పించాలి. బాలురు ఇటువంటి సందర్భాలలో పట్టించుకోనట్లు ఉండరాదు, వారిని తమ కుటుంబ సభ్యులలాగే భావించి, వారికి అవసరమైన చేయూతనందించాలి.

**కేస్ స్టడీ – 7** : ఆ రోజు పాఠశాల సందడిగా ఉంది. ఆ పాఠశాలలో చదివిన అమ్మాయి తహసీల్దారుగా ఎంపికయ్యింది. పాఠశాల నాయకులు, బృందం ఆ అమ్మాయికి అభినందన సమావేశం ఏర్పాటుచేశారు. ఆమెతోపాటు ఇటీవలే పంచాయతీ కార్యదర్శి, పోలీసుగా ఎంపికైన ఇద్దరు అమ్మాయిలను కూడా విద్యార్థుల సమావేశంలో అభినందించారు. అమ్మాయిలు కలెక్టరయినా, కండక్టరయినా వారి విజయసాధనకు చేసిన కృషి ప్రాతిపదికగా పాఠశాల వారి ఎంపికపట్ల గర్వపడుతోందని పాఠశాల నాయకులు సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం ఎంతో మంది బాలికలను లక్ష్యాలు నిర్దేశించుకునేట్లు చేసింది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపింది.

**విశ్లేషించండి – చర్చించండి :**

- పాఠశాల నాయకులుగా మీ పూర్వ విద్యార్థుల ప్రగతి ఆధారంగా ప్రస్తుత విద్యార్థులలో స్ఫూర్తిని ఎలా నింపగరు?
- మీరే ఎంపికైన పోలీసు అయితే మీరు విద్యార్థినులకు ఏం మార్గదర్శనం చేస్తారు?
- ఒక విద్యార్థిగా ఆ సమావేశంలో మీరుంటే మీరు ఏర్పరుచుకునే అభిప్రాయాలేవి?

మనం సాధారణంగా ప్రచార, ప్రసార సాధనాలలో వివిధ రంగాలలో విజయం సాధించిన వారి విజయగాథలను చూస్తుంటాం. ఇవన్నీ మనకు స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కలిగిస్తాయి, లక్ష్యాన్ని నిర్దేశించుకొనుటకు మార్గదర్శనంగా తోడ్పడతాయి. కాబట్టి పాఠశాలల్లో చదివిన పూర్వవిద్యార్థులతో పాఠశాలల్లో కార్యక్రమాలు ఏర్పాటుచేస్తే, విద్యార్థులు ప్రేరణ పొందుతారు. సాధారణంగా పెద్ద హోదా పొందినవారికి పేరెన్నిక కలిగిన విద్యాలయాలలో సీటు సాధించిన వారికే ప్రాధాన్యతనిస్తారు. కాని మన పరిసరాలను ప్రతిబింబించేలా పోలీసు, కండక్టరు, స్వయం ఉపాధితో విజయం సాధించిన వారిని, ప్రత్యేకంగా స్త్రీలను కూడా అభినందించడంవల్ల బాలికలకు 'సమానత' పట్ల సరైన దృక్పథం అవడుతుంది.

**కేస్ స్టడీ – 8** : పాఠశాల నుండి విద్యావిజ్ఞాన యాత్రకు వెళ్ళాలని నిర్ణయించారు. తరగతి నాయకురాలిగా కావేరి తప్పక రావాలని ఉపాధ్యాయుందరూ చెప్పారు. కాని కావేరి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కాని అదే

తరగతిలో చదువుతున్న పక్కింటి యమునను పంపడానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. యమునతో కలిసి ఇంకొందరు స్నేహితులు కావేరిని విజ్ఞానయాత్రకు పంపడానికి ఆమె తల్లిదండ్రులను ఒప్పించారు. ఉపాధ్యాయులు కూడా ఇందుకు సహకరించారు. విద్యావిజ్ఞాన యాత్రపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో కావేరికి ఆ సంవత్సరం జిల్లాలో మొదటిస్థానం లభించింది.

**విశ్లేషించండి – చర్చించండి :**

- కావేరి తల్లిదండ్రుల స్థానంలో మీరుంటే మీరేం చేస్తారు?
- కావేరి స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?
- ఉపాధ్యాయులుగా కావేరి తల్లిదండ్రులను మీరెలా ఒప్పిస్తారు?
- యమున స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?

ప్రస్తుత కాలంలో మహిళలు ఎల్లలు దాటి ప్రపంచ దేశాలలో ఎన్నో రంగాలలో విజయాలు సాధిస్తున్నారు. అదే సమయంలో కొత్త ప్రదేశాలకు వెళ్ళాలంటేనే కుటుంబ సభ్యులు ఒప్పుకోలేని పరిస్థితులు ఉన్నాయి. బాలికలకు అవకాశాలు కల్పిస్తే, వారు కూడా మిగిలిన వారిలాగానే అన్నింటిలో ప్రతిభ చూపగలరు. పాఠశాలల్లో జరిగే అనేక కార్యక్రమాలలో పాల్గొనడానికి విద్యార్థులు కొత్త ప్రాంతాలకు వెళ్ళవలసి ఉంటుంది. ఆయా సందర్భాలలో వారు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటుంటారు. వారికి మద్దతు తెలుపడంతోపాటు, తగిన భద్రతను కల్పిస్తూ వారు పాల్గొనేలా పాఠశాల కృషి చేయాలి.

పై ఎనిమిది కేస్‌స్టడీల వంటివి మీరు దైనందిన జీవితంలో చాలా పరిశీలించి ఉంటారు. వాటి గురించి ఆలోచించండి – విశ్లేషించండి. ముఖ్యంగా ఆయా సందర్భాలను ప్రభావితం చేసిన, ప్రభావానికి గురయిన వారి స్థానంలో మీరుంటే సహానుభూతితో మీరేం చేసేవారో తెలపండి.

## సంక్షిప్త సారాంశం

కుటుంబం, పాఠశాల, సమాజం తరతరాలుగా ఏర్పరుచుకున్న కొన్ని భావనలు మూసధోరణులుగా మారిపోయాయి. ఇవి వివక్షతకు దారితీస్తున్నాయి. కాలానుగుణంగా మారవలసిన అంశాలను ప్రస్తుత సమాజం ఇప్పుడు గుర్తిస్తోంది. ఒక ముందడుగు పడుతోంది. ఈ బాటలో పాఠశాల తన వంతు ముఖ్యపాత్రను పోషించాలి. ఒక మూసధోరణిని వ్యతిరేకిస్తున్నప్పుడు కొన్ని అడ్డంకులు రావడం సహజం. వాటిని అధిగమించినప్పుడు తప్పకుండా వివక్షత తొలగిపోయి 'సమానత' సాధ్యమవుతుంది. జెండర్‌పరమైన మూసధోరణులను ఇప్పుడిప్పుడే సమాజం ఎదుర్కొంటోంది. కొన్ని కుటుంబాలు తమ సంతానంలో బాలికలు, బాలురను స్థాయి, ఖర్చు ఆధారంగా పాఠశాలల్లో చేర్పించడం, ఆడపిల్లలపట్ల వివక్షత చూపడం జరుగుతోంది. ఇంకా సామాజిక కట్టుబాట్ల ప్రభావంతో బాలికలకు పరిమితులు, నిబంధలను విధించడం సరికాదు. బాల–బాలికలు ఒకరితో మరొకరు గౌరవించబడిన పద్ధతిలో మెలిగే అంశాలపై ఇరువురికి అవగాహన కల్పించాలి. బాలికల కంటే బాలుర ప్రవర్తనను తీర్చిదిద్దే పని కుటుంబం చేపట్టాలి. బాలికలు ఆత్మస్థైర్యంతో, ఆత్మ రక్షణ చేసుకునేలా శిక్షణను పొందగలగాలి. బాలికలు సొంత

నిర్ణయాలు తీసుకునేలా, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునేలా పాఠశాల తోడ్పాటునందించాలి. తద్వారా వివక్షత తొలగిపోతుంది. మన చుట్టూ ఉన్న కుటుంబాలలో, పాఠశాలల్లో, సమాజంలో జెండర్‌పరమైన మూసధోరణులు – వివక్షతను మనం చూస్తూ ఉంటాం. ఆయా సందర్భాలలో మనం సహానుభూతితో – ఆస్థానంలో మనముంటే ఏం చేయగలమో అర్థం చేసుకున్నప్పుడు మరింత చైతన్యంతో మనం ఈ వివక్షతను రూపుమాపేందుకు కృషిచేయగలం. ఇందుకు అనేక సంస్థలు, ప్రభుత్వం కూడా తోడ్పాటునందిస్తున్నాయి. బాలల హక్కుల పరిరక్షణకు, స్త్రీల రక్షణకు 1098, 100, 181 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలకు పరిష్కారం పొందవచ్చు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పోలీస్ స్టేషన్‌లలో కూడా జెండర్ సమానత కొరకు ప్రత్యేక విభాగాలున్నాయి.

**మదింపు**

1) కింది వాటిలో 'సరికాని' వాక్యాన్ని గుర్తించండి. ( )

A) లింగం (Sex) శారీరక సంబంధమైనది.

B) లింగం (Sex) జీవితాంతం మారదు.

C) జెండర్ సమాజంచే ఆపాదించబడుతుంది.

D) జెండర్ కాలానుగుణంగా మారదు. స్థిరంగా ఉంటుంది.

2) కింది వాటిలో 'సరయిన' వాక్యాన్ని గుర్తించండి. ( )

A) బాలికలు సున్నితంగా ఉంటారు, బాలురు దృఢంగా ఉంటారు.

B) బాలురతోపాటు బాలికలకు కూడా కుస్తీ పోటీలలో పాల్గొనేందుకు శిక్షణ ఇవ్వాలి.

C) బాల, బాలికలు ఒకే పాఠశాలలో, ఒకే సెక్షన్‌లో చదివించడం సరికాదు.

D) బాలికలు మాత్రమే శుభ్రపరచడం పనులు బాగా చేస్తారు, బాలురు చేయలేరు.

3) బాలలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ( )

A) పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలన్నింటిలో బాల, బాలికలకు సమాన ప్రాధాన్యతనివ్వాలి.

B) పాఠ్యాంశాలలో మాత్రమే బాగా తర్ఫీదునివ్వాలి. ఇది జీవితానికి పునాది అవుతుంది.

C) సహపాఠ్య కార్యక్రమాలు బాలికలకు అవసరంలేదు.

D) సిలబస్ పూర్తిచేసి, బాగా అభ్యాసం కల్పించాలి.

4) ప్రచార ప్రసార మాధ్యమాల ప్రకటనలలో స్త్రీలు, వార్తావిశేషాల విశ్లేషణలో పురుషులు ఎక్కువగా ఉండడానికి కారణం. ( )

A) స్త్రీలు ప్రకటనలలో చెప్పడం ద్వారానే వస్తువులను కొంటారు.

B) స్త్రీలు వార్తా విశ్లేషణ సరిగ్గా చేయలేరు.

C) స్త్రీలను ఆకర్షణకు ప్రతీకగా, పురుషులను నిష్ణాతులుగా చూపే ప్రయత్నం చేయడం.

D) వస్తువుల నాణ్యత కంటే స్త్రీల ప్రకటననే కొనుగోళ్ళను పెంచుతుంది.

5) బాలుర ఆటలు, బాలికల ఆటలని వేర్వేరుగా నిర్ధారించడానికి కారణం. ( )

A) బాలికలు కొన్ని ఆటలు ఆడలేరు

B) బాలురు కొన్ని ఆటలు ఆడలేరు

C) ఇది ఒక జెండర్ వివక్షత

D) బాల, బాలికలు కలిసి ఆడరాదు

6) బాలికలను తరగతి నాయకులుగా ఎన్నుకోవడానికి సంబంధించి "సరికాని" వాక్యాన్ని గుర్తించండి.( )

A) బాలురవలె బాలికలు ఏ పనుయినా నిర్వర్తించగలరు.

B) బాలబాలికలకు తరగతి నిర్వహణలో సమాన ప్రాధాన్యత నివ్వాలి.

C) బాలికలు తరగతి నాయకులుగా సొంతంగా అన్ని పనులు చేపట్టగలరు.

D) బాలికలకు ఇంటి దగ్గర చాలా పనులుంటాయి. కాబట్టి వారిని ఎన్నుకుంటే సమస్యలు వస్తాయి.

7) పున్నమి స్నేహితులతో కలిసి సినిమా నుండి వచ్చేటప్పుడు కొంత మంది బాలురు వేధించారు. పున్నమి ఏం చేయాంటే... ( )

A) స్నేహితులతో కలిసి సినిమాకు వెళ్ళరాదు.

B) తల్లిదండ్రులతో కలిసి మాత్రమే సినిమాకు వెళ్ళాలి.

C) పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

D) ఇంట్లో టెలివిజన్‌లో మాత్రమే సినిమాలు చూడాలి.

### రిఫరెన్సులు


1) మానవ హక్కుల విద్య, సర్వశిక్షా అభియాన్, తెలంగాణ.

2) ఆయుష్మాన్ భారత్, పాఠశాల ఆరోగ్య కార్యక్రమం, ఎన్.సి.ఇ.ఆర్.టి., న్యూఢిల్లీ.

3) జెండర్‌పై ఉపాధ్యాయ శిక్షణాదీపిక, సర్వశిక్షాఅభియాన్, తెలంగాణ?

4) పాఠశాల నాయకత్వ అభివృద్ధి కార్యక్రమం మాడ్యూల్, ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ.

5) EM 230 Policymaker Survey, India

6) Gender in equality in India – Wikipedia

7) Why is gender equality still elusive – Soumitro Charkraborty

8) The benefits of gender equality – VIC.GOV.AU